నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ప్రజలు కాంగ్రెసోళ్లను కొడుదామని చూస్తున్నారు

- సిర్పూర్ ఎమ్మెల్యే తెలంగాణ త్యాగ్యాన్ని అవమానిస్తున్నరు
- ఆర్ఎస్పీ నాయకత్వంలో సిర్పూర్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి
- నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మంచిర్యాల, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెసోళ్లను ప్రజలు కొడుదామని చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సెక్యూరిటీ లేకుండా రేవంత్‌రెడ్డి వచ్చినా ప్రజలు వదిలిపెట్టరని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిర్పూర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఇంత దారుణమైన పాలన చూడడంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఇక సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబును చూస్తే నవ్వొస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డల త్యాగాన్ని అవమానిస్తూ నియోజకవర్గాన్ని మహారాష్ట్రలో కలుపాలని సోయిలేకుండా మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. అలాంటి వారి చేతిలో సిర్పూర్ ఆగమైపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

గెలుపోటములు సహజం

- క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలి
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 : గెలుపోటములు సహజమని, ఎవరూ గెలిచినా నిరుత్సాహపడకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. శనివారం బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ స్టేడియం నంబర్ వన్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ బెల్లంపల్లి పట్టణ యూత్ అధ్యక్షుడు సబ్బని అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో రోజుల పాటు జరిగే క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. పోటీల్లో పది జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్స్, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ తాజామాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, కొమ్మెర లక్ష్మణ్, నాయకులు పైడిమల్ల చంద్రశేఖర్, గుడిసెల మనోహర్, ఆకుల సాయి, రంగం మహేశ్, సంభోజి సురేష్, బండారి రవీందర్, రాకేశ్, అన్వేష్, అభి పాల్గొన్నారు.

వరిపేట శివారులో పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వరిపేట శివారులోనే పెద్దపులి

కాసిపేట, ఫిబ్రవరి 8 : మండలంలోని వరిపేట శివారులోనే పెద్దపులి మకాం వేసింది. వరిపేట, పెద్దనపల్లి, దుబ్బగూడెం, సోమగూడెం పాత బస్తీ, బుగ్గగూడెం, కన్నాల శివార్ల మధ్య జనావాసాలకు దగ్గరగా పెద్దపులి(బీ1) సంచరిస్తున్నది. కొద్ది రోజుల క్రితం కన్నాల అటవీ ప్రాంతంలో అడవిపందిని వేటాడి చంపగా, మూడు రోజుల క్రితం వరిపేట శివారులోని పంట చేలలో మరో అడవి పందిని చంపింది. దాని మాంసాన్ని తింటూ ఇక్కడే తిష్ట వేసింది. అధికారులు పాదముద్రలను గుర్తించారు. బెజ్జూరు నుంచి వచ్చిన పెద్దపులి(బీ1) కాసిపేట, బెల్లంపల్లి మండల శివారు ప్రాంతంలో సంచరిస్తుండగా, అధికారులు ఎప్పటికప్పుడు దాని కదలికలను గమనిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పెట్రోలిం గ్ విధుల్లో డిప్యూటీ రేంజర్లు ప్రవీణ్ నాయక్, సతీశ్, ఎఫ్‌బీవోలు యుగేందర్, కుమార స్వామి, శంకర్, యానిమల్ ట్రాకర్ సమ్మయ్య ఉన్నారు.

కేటీఆర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 8: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేలా చూడాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడంలో పేపర్ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, దీంతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు లెండుగురే శ్యాంరావు, అంబాల ఓదెలు, కన్నయ్య పాల్గొన్నారు.

పంచాయతీ సమరానికి 31



ఈ నెలలోనే స్థానిక పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్!

- ముందు ఎంపీటీసీ, జడ్పీటీసీ.. తర్వాత సర్పంచ్..
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు.. రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ
- తప్పుల తడకగా కులగణన లెక్కలు.. కాంగ్రెస్ పార్టీకి చిక్కులు..



జిల్లాల వారీగా సర్పంచ్ స్థానాలు..

మంచిర్యాల, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్థానిక సంస్థల సమరానికి సమయం వచ్చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఓకే చెప్పడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పల్లెపోరుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఈ నెల 15వ తేదీలోగా ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతాయంటూ ప్రచారం జోరందుకున్నది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముందు నిర్వహించి, అవయ్యాక సర్పంచ్ ఎన్నికలు ఉంటాయని చెప్తున్నారు. అధికారులు మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల పునర్విభజన కూడా పూర్తి చేశారు. పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం ప్రతి మండలానికి ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలన్న నిబంధన ఉంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ సంఖ్య పెరిగింది. ఆదిలాబాద్‌లో జిల్లాలో గతంలో 158 ఎంపీటీసీలు ఉంటే ప్రస్తుతం 8 స్థానాలు పెరిగాయి. జడ్పీటీసీలు 17 నుంచి 19కి పెరిగాయి. సోనాల, సాత్నాల రెండు కొత్త మండలాలు ఏర్పడడంతో స్థానాలు పెరిగాయి. ఇక నిర్మల్ జిల్లాలో 156 నుంచి 157 ఎంపీటీసీలకు పెరిగాయి. పెంబి మండలం వెంకంపోచంపాడు అనే ఎంపీటీసీ స్థానం పెరిగింది. జడ్పీటీసీలు గతంలో మాదిరి 18 ఉన్నాయి. ఆసిఫాబాద్ జిల్లాలో 123 ఉన్న ఎంపీటీసీ స్థానాలు 127కి పెరిగాయి. జిల్లాలోని రాజంపేట, సిర్పూర్(యూ) మండలాల్లోని రాఘవపూర్, లింగాపూర్ మండలంలోని కంచన్‌పల్లి, పెంచికల్‌పేట్ మండలంలోని కమ్మర్‌గాంలో ఎంపీటీసీ కొత్త స్థానాలు ఏర్పాటు చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో హాజీపూర్ మండలంలోని గ్రామాల సంఖ్య తగ్గింది. దీంతో ఆ మండలంలో ఎంపీటీసీల సంఖ్య 9 నుంచి 6కి తగ్గింది. చట్ట ప్రకారం భీమారం, భీమిని మండలాల్లో ఒక్కో స్థానం పెరిగింది. దీంతో మంచిర్యాల జిల్లాలో గతంలో 130 ఉన్న ఎంపీటీసీ స్థానాల సంఖ్య 129కి తగ్గింది.

అధికార పార్టీకి తలనొప్పిగా మారిన సర్వే.. రిజర్వేషన్లపై ఉత్కంఠ..

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కులగణన సర్వే లెక్కలు విడుదల చేయడం అధికార కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందిగా మారనుంది. తప్పుల తడకగా సర్వే చేశారంటూ బీసీలు మండిపడుతున్నారు. స్థానిక సంస్థల్లో తమ రిజర్వేషన్‌ను తగ్గించే కుట్రలో భాగంగా జనాభాను తగ్గించి చూపించారనే ఆరోపిస్తున్నారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణపై కూడా మాదిగ, మాల సామాజిక వర్గాలు ఎవరికి వారు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తాయనే అంచనాలు వినిపిస్తున్నాయి. పైగా 13 నెలల పాలనపైనా జనం అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా, మండల పరిషత్‌ల ఎన్నికలను ముందు నిర్వహిస్తే.. అది కూడా మైనస్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రతికూల ప్రభావం సర్పంచ్ ఎన్నికలపైనా పడుతుందని నిపుణులు అంటున్నారు. జిల్లా, మండల పరిషత్‌ల పాలకవర్గాలు ఖాళీ ఏర్పడి ఎనిమిది నెలలు గడిచింది. ఇక గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పదవీకాలం పూర్తయి ఏడాది పూర్తయ్యింది. చాలా కాలంగా గ్రామాలు, మండలాల్లో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ప్రకటన రావడం చర్చనీయాంశంగా మారింది. ముందు పంచాయతీ ఎన్నికలా? లేక జిల్లా, మండల పరిషత్ ఎన్నికలా? అన్న విషయాన్ని పక్కన పెడితే ఎన్నికల కోసం ఎదురు చూసే ఆశావహుల సంఖ్య గతంతో పోలిస్తే భారీగా పెరిగింది. కులగణన సర్వే పూర్తవడంతో రిజర్వేషన్ల అంశంలో అన్ని సామాజిక వర్గాల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. మా ఊరు రిజర్వేషన్ బీసీకి వస్తదా? ఎస్సీకి వస్తదా? జనరల్‌కు వస్తదా? మహిళలకు ఇస్తారా? అంటూ ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. గ్రామంలో గతంలో ఉన్న రిజర్వేషన్లు, గ్రామ జనాభా, రొటేషన్ పద్ధతిలో ఎవరికి ఇస్తారో అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారై నోటిఫికేషన్ వస్తే స్థానిక సంస్థల ఎన్నికల సమరం రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయి.



ఉమ్మడి జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు..

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు బోధించిన అధికారి

గంగాపూర్ పాఠశాలలో పాఠం చెబుతున్న కలెక్టర్

రెబ్బెన, ఫిబ్రవరి 8 : పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే అన్నారు. శనివారం రెబ్బెన మండలం గంగాపూర్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రం బోధించి పలు ప్రశ్నలు అడిగారు. సమాధానాలు రాబట్టారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాను ముందంజలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు, హెచ్ఎం అబ్దుల్ లతీఫ్, గణితం ఉపాధ్యాయురాలు పావని ఉన్నారు.

ఈవీఎంల గోదాం పరిశీలన

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 8 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోదాం వద్ద రక్షణ చర్యలను పరిశీలించారు. గోదాములో భద్రపరిచిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను భద్రపరిచిన తీరును సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకుడు సునీల్, నాయబ్ తహసీల్దార్ శ్యామ్‌లాల్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

నస్పూర్, ఫిబ్రవరి 8 : ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎన్నికలకు 18, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి, మంచిర్యాల ఆర్డీవోలు హరిక్రిష్ణ, శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో గణపతి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- ఘనంగా బ్రిలియంట్ స్కూల్ వార్షికోత్సవం

మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 8 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శనివారం సాయంత్రం సీసీసీ నస్పూర్‌లోని ఎంఎం గార్డెన్‌లో నిర్వహించిన బ్రిలియంట్ పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 ఏళ్లుగా బ్రిలియంట్ విద్యాసంస్థలను ప్రారంభించి విజయవంతంగా నడిపిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. విద్యార్థులు చదువులతో పాటు వివిధ యాక్టివిటీస్‌పై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యా సంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ మాట్లాడుతూ నస్పూర్‌లో తమ పాఠశాలను ప్రారంభించి తొమ్మిదేళ్లు అవుతుందని, ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చేందుకు బాటలు వేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సారిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగం సవాళ్లతో కూడినది

- మంచిర్యాల డీసీపీ భాస్కర్
- టచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పోలీసులకు ఉచిత వైద్య శిబిరం

మాట్లాడుతున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 8 : పోలీస్ ఉద్యోగం అనేక సవాళ్లతో కూడుకున్నదని, సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకెళ్లాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో మంచిర్యాల టచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పోలీసులకు కార్డియాలజీ స్క్రీనింగ్‌కు సంబంధించిన ఉచిత వైద్య శిబిరాన్ని పట్టణ సీఐ ప్రమోద్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీపీ మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో చనిపోయిన పోలీస్ సిబ్బంది గురించి వివరించారు. ప్రతి ఉద్యోగంలో ఒత్తిడిలు ఉంటాయని, పోలీస్ ఉద్యోగంలో అవి సహజమని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. ఇటీవల ఎస్ఐగా విరమణ పొందిన రాములు అందించిన సేవలను అభినందించారు. ఈ శిబిరంలో ప్రతి రోజూ 20 మందికి చొప్పున దాదాపు 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం టచ్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణుడు రాజేశ్ బుర్కుండే గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వికాస్, తిరుమల్‌రావు, సీఈవో రాజ్ పాల్, మేనేజింగ్ డైరెక్టర్ మాటెటి శ్రీనివాస్, డైరెక్టర్లు శేఖర్, జాన్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుభాష్ రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రైళ్లు రద్దు

ఈ నెల 20వ తేదీ వరకూ రాకపోకలు నిలిపివేత

బెల్లంపల్లి/కాగజ్‌నగర్/తాండూర్, ఫిబ్రవరి 8 : ఖమ్మం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్నందున 10 నుంచి 20వ తేదీ వరకు సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు చీఫ్ కమర్షియల్ అధికారి కైలాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు వరకు నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలుకు లింకు ఉండడంతో రద్దు చేసినట్లు ఆయన ప్రకటించారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించనున్నట్లు, కొన్నింటిని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మందమర్రి, రవీంద్రఖని, మంచిర్యాల మీదుగా నిత్యం వేలాది మంది ప్రయాణికులు సికింద్రాబాద్, కాజీపేట్ వైపు వెళ్తుంటారు. ఇప్పటికే మూడోలైన్ పనులు, ఇతర మరమ్మతుల కారణంగా రెండేళ్లుగా చాలా రైళ్ల రద్దు కావడమేగాక దారి మళ్లించారు. ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రద్దుతో 11 రోజుల పాటు అవస్థలు తప్పలా లేవు. ఇవే కాకుండా కొచ్చి నుంచి కోట్రా ఎక్స్‌ప్రెస్(22648) ఈనెల 11, 14,18 తేదీల్లో రద్దు చేశారు. కోట్రా నుంచి కొచ్చి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12500) ఈ నెల 15, 17 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. గోరఖ్‌పూర్ నుంచి కొచ్చికి వెళ్లే రప్తిసాగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12512) రూటును మళ్లించినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. అయితే ఎక్కడో ఖమ్మంలో రైల్వే మార్గం పనులు జరిగితే ఇక్కడ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేయడమేమిటని తాండూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త కామని శ్రీనివాస్ ప్రశ్నించారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌తో భాగ్యనగర్ రైలుకు లింక్ ఏమిటో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. భాగ్యనగర్, గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిపించేలా చూడాలని, ఇందుకు రైల్వే అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఆర్టీసీ జేఏసీ చైర్మన్ దివాకర్
- నిరవధిక సమ్మె వాల్ పోస్టర్ విడుదల

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 8 : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ టీ. దివాకర్ అన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి చేపట్టబోయే నిరవధిక సమ్మె వాల్ పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో జేఏసీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలను చెల్లించాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు